www.prajasakti.com
# ప్రజాశక్తి
గురువారం 3 జులై 2025
5
ఏలూరు

## 5న లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి
**జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి**

ఏలూరు అర్బన్ : ఈ నెల ఐదో తేదీన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి కోరారు. స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో శ్రీదేవి మాట్లాడుతూ కేసుల సత్వర పరిష్కారం నిమిత్తం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో కక్షిదారులు తమ కేసులను పరిష్కరించు కోవడం వల్ల సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని కేసుల నుంచి విముక్తి పొందాలని సూచించారు. జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ మాట్లాడుతూ ప్రత్యక్షంగా హాజరు కాలేని కక్షిదారులు ఆన్‌లైన్ ద్వారా తమ కేసులను పరిష్కరించుకోవడానికి తగిన ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.

# కొల్లేరు కొలిక్కి వచ్చేనా..!

**జూన్17,18వ తేదీల్లో కేంద్ర సాధికార కమిటీ పర్యటన**
**కొల్లేరు ప్రజలు, ప్రజా సంఘాల నుంచి పెద్ద ఎత్తున వినతులు**
**ప్రత్యేకంగా బృందం సభ్యులను కలిసి సిపిఎం వినతి**
**కొల్లేరు శాశ్వత పరిష్కారం కోసం ప్రజా సంఘాలు పోరుబాట**
**నేడు విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశం**

కొల్లేరు బృందం పర్యటన (ఫైల్ ఫొటో)

**ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి**

కొల్లేరుకు శాశ్వత పరిష్కారం చూపాలని, సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని కొల్లేరు ప్రజలతోపాటు, ప్రజాసంఘాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. ఇటీవల కొల్లేరుపై అధ్యయనం చేసేందుకు వచ్చిన కేంద్ర సాధికార కమిటీని కలిసి వినతులు ఇవ్వడంతోపాటు, జిల్లా స్థాయిలో రౌండ్ టేబుల్ సమస్యలు నిర్వహించారు. కేంద్రం బృందం పర్యటించి వెళ్లి 15 రోజులు గడిచిపోతోంది. దీంతో కొల్లేరు సమస్యను త్వరితగతిన పరిష్కరించడంతోపాటు, అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై మూడో తేదీ గురువారం విజయవాడలో రైతు, కౌలురైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమాశం జరగనుంది. కొల్లేరును అనుకుని, బెడ్, బెల్టు గ్రామాలు 124 ఉండగా మూడు లక్షలకుపైగా జనం నివసిస్తున్నారు. వీరందరికీ కొల్లేరే జీవనాధారం. 2006లో ఆపరేషన్ కొల్లేరు పేరుతో చేసిన చెరువుల ధ్వంసంతో కొల్లేరు ప్రజలు రోడ్డున పడ్డ పరిస్థితి నెలకొంది. ఆ తర్వాత ఎన్నికలొచ్చినప్పుడల్లా రాజకీయ పార్టీలు కొల్లేరు ప్రజలను నమ్మించి మోసం చేయడం పరిపాటిగా మారింది. తమకు న్యాయం చేయాలంటూ కొల్లేరు ప్రజలు దశాబ్దాలుగా పోరాడుతూనే ఉన్నారు. కొల్లేరు ప్రాంతాన్ని పరిశీలించేందుకు జూన్ 17, 18వ తేదీల్లో కేంద్ర సాధికార కమిటీ కొల్లేరులో పర్యటించింది. ప్రజలు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల నుంచి వినతులు స్వీకరించింది. అధికారులతో ప్రత్యేకంగా సమావేశమై వివరాలు తీసుకుంది. సాధికార కమిటీ సుప్రీంకోర్టు ఏవిధంగా ఇస్తుందో అని ప్రజల్లో ఉత్కంఠ రేపుతోంది. కొల్లేరుకు శాశ్వత పరిష్కారం లభిస్తుందా అన్న చర్చ జనాల్లో జరుగుతోంది. ప్రభుత్వంపై మరింత ఒత్తిడి తెచ్చేందుకు ప్రజా సంఘాలన్నీ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి పలు డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచేందుకు సిద్ధమైంది. కొల్లేరులోని వేలాది ఎకరాల ప్రభుత్వ భూములను అక్కడి పేదలకు పంపిణీ చేయాలని, అటవీశాఖ అధికారుల వేధింపులు, అవినీతిని అరికట్టాలని, ఐదో కాంటూరు నుంచి మూడో కాంటూరుకు కుదించాలని, కొల్లేరు గ్రామాలకు రోడ్లు, విద్యుత్, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించాలని పలు డిమాండ్లను ప్రజాసంఘాలు ప్రభుత్వం ముందు ఉంచేందుకు సిద్ధమయ్యాయి.

**20 ఏళ్లుగా నరక యాతన**

2006లో కొల్లేరు ఆపరేషన్ తర్వాత కొల్లేరు ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. ఉపాధి లేకుండా పోయింది. వలస పక్షుల్లా ఇతర రాష్ట్రాలకు వెళ్లి చేపల వేట చేస్తూ కడుపునింపుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. 1975-76లో అప్పటి వెంగళరావు ఏర్పాటు చేసిన 146 సొసైటీ పరిధిలోని 7,100 ఎకరాల్లోని చెరువులను ధ్వంసం చేయడంతో అంతా రోడ్డున పడ్డారు. చిల్లిగవ్వ ఆదాయం లేకుండా పోయింది. అంతేకాకుండా నిబంధలనకు విరుద్ధంగా 14,800 ఎకరాలు ధ్వంసం చేశారు. కనీసం పరిహారం కూడా ఇవ్వలేదు. అటవీశాఖ నిబంధనల పేరుతో రోడ్లు, తాగునీరు వంటివి సైతం సక్రమంగా అమలు చేయడం లేదు. అటవీశాఖ అధికారులు కొల్లేరు ప్రజలను తీవ్రంగా వేధిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. వీటికితోడు ఐదో కాంటూరుపైన పది కిలోమీటర్ల వరకూ సెన్సిటివ్ జోన్‌గా ప్రకటించి మరో 89 గ్రామాలపై ఆంక్షలు విధించిన పరిస్థితి నెలకొంది. దీంతో పర్యావరణంతోపాటు, మనుషులను కూడా కాపాడంటూ కొల్లేరు ప్రజలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొల్లేరు సమస్యను సుప్రీం కోర్టుకు తీసుకెళ్లడంలో పూర్తిగా విఫలమైన పరిస్థితి. ఆ కారణంగానే 20 ఏళ్లగా కొల్లేరు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొల్లేరు ప్రజలకు న్యాయం చేస్తామంటూ కూటమి ప్రభుత్వం చెబుతోంది. దీంతో కొల్లేరుకు శాశ్వత పరిష్కారం చూపాలంటూ అన్ని తరగతుల నుంచీ మద్దతు పెరిగింది. ప్రభుత్వం మాటలకే పరిమితమవుతుందా సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తుందా చూడాల్సి ఉంది.

# వారధి శిథిలం.. దారులు అస్తవ్యస్తం..!

- శిథిలావస్థలో నారాయణపురం వంతెన
- 4 ప్రత్యామ్నాయ మార్గాలు అధ్వానం
- విద్యార్థులు, ఆక్వా రైతులు, ప్రజలకు భారం

దండుదారి పుంతదారి దుస్థితి ఇలా

శిథిలావస్థకు చేరిన నారాయణపురం వద్ద ఆర్అండ్‌బి బ్రిడ్జి

**ప్రజాశక్తి - ఉంగుటూరు**

ఏలూరు ప్రధాన కాలువపై నారాయణపురం వద్ద ఆర్అండ్‌బి బ్రిడ్జి పాక్షికంగా కూలిన నేపథ్యంలో వాహనాల రాకపోకలకు నాలుగు ప్రత్యామ్నాయ దారులు దాటాలంటే సాహసంగా మారింది. 1932లో అప్పటి బ్రిటీష్ పాలకుల ఆధ్వర్యంలో నారాయణపురానికి చెందిన పలువురు రైతులే వారధిని నిర్మించారు. ఇప్పుడా వారిధి శిథిలావస్థకు చేరి ఈ నెల 15న పాక్షికంగా స్లాబుకు రంధ్రం పడింది. దీంతో ఆర్అండ్‌బి అధికారుల సిఫార్సులతో పోలీసులు ఈ వంతెన మీదుగా రాకపోకలను దారి మళ్లించారు. వివిధ ప్రాంతాల నుంచి నారాయణపురం వచ్చి వాహనదారులు, ప్రజలకు సాహసంతో కూడిన వ్యవహారంలా మారింది.

**నాలుగు ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాలంటే ప్రాణాలు అరిచేతిలోనే..**

చేబ్రోలు పోలీసు స్టేషన్ నుంచి నారాయణపురం కాలువ గట్టు కంకర రోడ్డులో ప్రయాణించే వాహనాలు తరచూ దిగబడి పోతున్నాయి. ఇటీవల చేపల లారీ దిగబడిపోతే దాన్ని బయటకు తీసేందుకు దాదాపు 10 గంటల సమయం పట్టింది. ఈలోపు ఈ దారిలో వెళ్లే వాహనాలన్నీ వేరే రూట్‌కు వెళ్లాయి. పోలీసు స్టేషన్ ఎదురుగా రోడ్డుకు ఒక పక్క లోతైన పంట కాలువ, మరో పక్క ఏలూరు కాలువ ఉంది. ఏమాత్రం వాహనం కంట్రోల్ తప్పినా జల సమాధే.

**దండుదారి పుంత దారి...**

నారాయణపురం అపార్ట్‌మెంట్స్ (దండుదారి పుంత) దారి నుంచి తల్లాపురం - చేబ్రోలు పొలాలకు వెళ్లే పుంతదారి మొన్నటి వరకూ రైతులు, దుక్కిదున్నే ట్రాక్టర్లు, కూలీలు ప్రయాణించేందుకు అంతంతమాత్రంగా అనువుగా ఉండేది. అలాంటిది చేబ్రోలు నుంచి బస్సులు, ఇతర రవాణా భారీ వాహనాలు సైతం ఇదే దారి గుండా రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి. ఇంతటి ప్రాధాన్యత కలిగిన ఈ దారిని పక్కాగా నిర్మించాల్సిన ఆర్అండ్‌బి అధికారులు కంకరతో రోడ్డును వెడల్పు చేసి మెరక పోశారు. అయితే ప్రస్తుతం ఆ దారి వర్షాలకు బురదమయంగా మారింది. కనీసం నడిచి వెళ్లేందుకు కూడా కష్టం ఉంది.

**రాజుల కాలనీ - తహశీల్దార్ కార్యాలయం రోడ్డు**

రాజుల కాలనీ నుంచి తహశీల్దార్ కార్యాలయం మీదుగా ఉంగుటూరు జాతీయ రహదారిని చేరుకునేందుకు తేలికపాటి వాహనాలకు అనువైంది. ఈ పుంత రోడ్డు మూడు మీటర్ల వెడల్పే ఉంది. ఇంకా ఐదారు మీటర్లు ఆక్రమణలో ఉంది. పంట కాలువపై కల్వర్టుకు ఇరువైపులా రెయిలింగ్ లేదు. ఆదమరిస్తే వాహనాలు పంట కాలువలో పడిపోయే ప్రమాదం ఉంది. ఆక్రమణలను తొలగించి రోడ్డు నిర్మిస్తే గాని ఈ మార్గం పూర్తిస్థాయిలో వాడుకలోకి రాదు. అయితే గోతులను పోలీసులు పూడ్చించారు.

**తోకలపల్లి మురుగుకాలువ లాకుల వంతెన**

నారాయణపురం నుంచి గణపవరం వెళ్లే వారికి ఉంగుటూరు - రావులపర్రు మీదుగా రాచూరు నుంచి గణపవరం వెళ్లేందుకు ఎంతో అనుకూలమైన మార్గంలో ఇదొకటి. అయితే రావులపర్రు వద్ద పత్తేపురం పంట కాలువపై కల్వర్టు బ్రిడ్జి 2018లో కూలిపోయింది. దాని స్థానంలో రూ.80 లక్షలతో వంతెన పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం బాటమ్ స్లాబులో పనులు జరుగుతున్నాయి. ఈ కారణంగా ఈ రూట్‌లో వాహనాలు తిరగవు.

**అదనపు భారం**

ఈ నాలుగు దారులు అనేక సమస్యల కారణంగా వివిధ ప్రాంతాల నుంచి నారాయణపురం వచ్చి వెళ్లేవారు అవస్థలు పడుతున్నారు. కళాశాలల బస్సులు, ఆక్వా తదితర వాహనాల చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. దీనిపై రవాణా ఖర్చుల భారం ప్రజలపై పడనుంది. జంగారెడ్డిగూడెం నుంచి భీమవరం వెళ్లే ఆర్‌టిసి బస్సు నారాయణపురం హైవే వరకూ వచ్చి వెనక్కి వెళ్తోంది. అందులో ప్రయాణికులను వేరు బస్సులో భీమవరం వైపు ప్రయాణించాల్సి వస్తోంది. దీంతో అత్యవసర పనులపై వెళ్లేవారికి దూరా భారం తప్పడం లేదు.

**అనువుగాని సమయంలో కంకర పనులు ఎందుకు..**

నారాయణపురం దండుదారి పుంత దారిలో కంకర వేసిన కారణంగా బురదకయ్యగా మారింది. చేలల్లో గట్లు లంకలు, దమ్ములు చేసేందుకు కూలీలు, సైకిళ్లు ట్రాక్టర్లు సైతం వెళ్లలేని పరిస్థితి. ముందుచూపు లేకుండా అనువుగాని సమయంలో కంకర వేయడం సరికాదు. మెటల్, స్టోన్ డస్ట్ వేసి చదును చేసి ఆపై కంకర వేస్తే వర్షం పడినా కొంత కాలం రోడ్డు ఆగేదని గ్రామస్తులు, రైతులు వాపోతున్నారు.

ఇటీవల వచ్చిన ఆర్అండ్‌బి చీఫ్ ఇంజినీర్ ఎం.శ్రీనివాసరెడ్డి మూడు నెలల్లో కొత్త వంతెన నిర్మాణం చేపట్టేలా ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపి నిధులు వచ్చిన తరువాత పనులు చేపడతామని తెలిపారు.

**సమస్య పరిష్కారానికి కృషి..**
**పత్సమట్ల ధర్మరాజు, ఎంఎల్ఎ**

నారాయణపురం వారధి మూసేయడం వల్ల ప్రత్యామ్నాయ మార్గాలను విస్తరించేలా ఉన్నతాధికారులతో నిరంతరం మానిటరింగ్ చేస్తున్నాం. వర్షం తగ్గగానే దండుదారి పుంతను చదును చేయించి దానిపై మెటల్ రోడ్డు నిర్మించేలా ఆర్అండ్‌బి అధికారులకు తగు ఆదేశాలు ఇచ్చాను. తక్షణం మరుమ్మతులకు రూ.30 లక్షలకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి వెళ్లాయి. ఇంకా నిధులు మంజూరు కాలేదు.

## కొల్లేరు ప్రజల సమస్యలపై నేడు రౌండ్‌టేబుల్ సమావేశం

**ప్రజాశక్తి - ఏలూరు అర్బన్**

కొల్లేరు ప్రజల సమస్యలపై నేడు విజయవాడలో రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయా సంఘాల నాయకులు తెలిపారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర నాయకులు బి.బలరాం, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి, జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ బుధవారం ఒక సంయుక్త ప్రకటనను విడుదల చేశారు. ఈనెల మూడవ తేదీన ఉదయం 10 గంటలకు విజయవాడ రాఘవయ్య పార్కు ఎదురుగా ఉన్న బాలోత్సవ భవనంలో ఈ రౌండ్ టేబుల్ సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. కొల్లేరు ప్రజల సమస్యలపై పనిచేస్తున్న వివిధ రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక, ప్రజా సంఘాలు, ప్రజా ప్రతినిధులు, దళిత, మత్స్యకార సంఘాలు, వివిధ సంస్థల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కొల్లేరు ప్రజల సమస్య శాశ్వత పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై ఈ సమావేశంలో చర్చించడం జరుగుతుందని తెలిపారు.

## వరదల దృష్ట్యా ముందస్తు చర్యలు చేపట్టాలి
### సిపిఎం ఆధ్వర్యాన తహశీల్దార్లకు వినతి

వేలేరుపాడు రూరల్ : తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

**ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్**

రానున్న గోదావరి వరదల దృష్ట్యా ప్రజలకు పునరావాసం కల్పించి, పునరావాస కేంద్రాలకు తరలించడానికి ముందస్తు సహాయక చర్యలు చేపట్టాలని తహశీల్దార్ డివి.సత్యనారాయణకు సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ధర్ముల రమేష్, సీనియర్ నాయకులు మడివి దుర్గారావు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు వల్ల సర్వం కోల్పోతున్న నిర్వాసితులు ఏటా వచ్చే వరదలకు, పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ వల్ల మండల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కడుపు కట్టుకొని కష్టపడి సంపాదించిన వస్తువులన్నీ నీటి పాలయ్యాయన్నారు. ఇళ్లు నీట మునిగి గూడు లేక అడవిలోనే బరకాల కూడా లేకుండా కారు చీకటిలోనే తలదాచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. గత వరదల సమయంలో జరిగిన నిర్లక్ష్యాన్ని పునరావృతం కాకుండా ముందస్తుగా మండలానికి తగినన్ని బోట్లు ఏర్పాటు చేయాలని, ముందుగానే తాత్కాలిక పునరావాసాలు ఏర్పాటు చేయాలని, నిత్యావసర సరుకులు, బరకాలు, కిరోసిన్ వంటివి ముందే అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు కారం వెంకట్రావు, మడకం ఏసుబాబు, కొత్త వెంకటేశ్వర్లు, కరాటం ప్రకాష్ పాల్గొన్నారు.

**కుక్కునూరు రూరల్** : పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పునరావాసం కల్పించి, తక్షణం వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎర్రంశెట్టి నాగేంద్రరావు డిమాండ్ చేశారు. గోదావరి వరదలను దృష్టిలో ఉంచుకొని మండలంలోని 41.15 కాంటూర్ పరిధిలోని అన్ని గ్రామాల నిర్వాసితులకూ వ్యక్తిగత ఇంటి నష్టపరిహారం చెల్లించాలన్నారు. ఈ మేరకు సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎర్రంశెట్టి నాగేంద్రరావు మాట్లాడుతూ గత గోదావరి వరదల సమయంలో జరిగిన నిర్లక్ష్యాన్ని పునరావృతం కాకుండా అధికార యంత్రాంగం ముందుగానే అప్రమత్తమై లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు చేర్చాలన్నారు. వారికి అవసరమైన నిత్యావసర సరుకులు బరకాలు కిరోసిన్ బియ్యం ముందుగానే అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు పట్ల లక్ష్మయ్య రమేష్ పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల కొరత సమస్యను పరిష్కరించాలి
**సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి**

**ప్రజాశక్తి - ఏలూరు అర్బన్**

కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో ఉపాధ్యాయుల కొరత సమస్యను వెంటనే పరిష్కరించాలని సిపిఎం జిల్లా కమిటీ తరపున జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వికి బుధవారం టపాలో వినతి పత్రాన్ని అందించారు. ఈ మేరకు పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల నిర్వహించిన ఉపాధ్యాయుల బదిలీ కౌన్సిలింగ్ సందర్భంగా ఏలూరు జిల్లాలోని కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో టీచర్ల కొరత ఏర్పడిందని తెలిపారు. దీంతో ఈ రెండు మండలాల విద్యార్థులకు విద్య అందించడంలో అన్యాయం జరుగుతోందని తెలిపారు. ఒక్కో మండలంలో 41 పాఠశాలల చొప్పున కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో మొత్తం 82 పాఠశాలలు ఉన్నాయని చెప్పారు. ఈ పాఠశాలల్లో మొత్తం ఉండాల్సిన ఉపాధ్యాయుల్లో కేవలం ఒక పాఠశాలకు ఒక ఉపాధ్యాయుడు మాత్రమే ప్రస్తుతం ఉన్నారని తెలిపారు. దాదాపు 100 నుండి 125 మంది వరకూ పిల్లలు ఒక్కో పాఠశాలలో ఉండడం వల్ల టీచర్లకు వారిని సర్ది చూసుకోవడానికి సమయం సరిపోతోందని, పాఠాలు చెప్పడానికి వీలు పడడం లేదని వివరించారు. ఉపాధ్యాయుల కౌన్సిలింగ్ సందర్భంగా ఈ పరిస్థితిని ముందుగా అధికారులు అంచనా వేయకపోవడం బాధాకరం అని చెప్పారు. కలెక్టర్ తక్షణం సమస్య పరిష్కారానికి పూనుకోవాలని కోరారు. డిప్యూటేషన్‌పై టీచర్లను పంపించడం గాని లేదా తాత్కాలికంగా విద్యా వాలంటీర్లను ఏర్పాటు చేయడం గానీ చేయాలని సూచించారు.

## 9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

**ప్రజాశక్తి - వేలేరుపాడు**

కేంద్రంలో బిజెపి అధికారంలోకొచ్చినప్పటి నుంచి కార్మికుల చట్టాలకు వ్యతిరేకంగా అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల తొమ్మిదో తేదీన చేపట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు మడివి దుర్గారావు పిలుపునిచ్చారు. మండలంలోని స్థానిక సిపిఎం కార్యాలయంలో సిఐటియు అనుబంధ విభాగమైన ఫ్రెండ్స్ ఆటో యూనియన్ సమావేశం యూనియన్ ప్రెసిడెంట్ కురుమెళ్ల శ్రీను అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి సిఐటియు జిల్లా నాయకులు మడివి దుర్గారావు, సిపిఎం మండల కార్యదర్శి ధర్ముల రమేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా జాప్యం చేస్తున్నందువల్ల కార్మికులు రోడ్డెక్కి నిరసనలు తెలియజేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. బ్రిటిష్ కాలంలోనే కార్మికుల చట్టాలపై ప్రాణాలర్పించి ఎనిమిది గంటలు పని దినాలుగా తీసుకొచ్చిన ఘనత కార్మిక చట్టాలకు ఉందన్నారు. ఆ చట్టాలను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మికుల గొంతు కోయాలని చూస్తుందన్నారు. బిజెపి ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక చట్టాలకు వ్యతిరేక విధానాలను తిప్పి కొడుత చేపట్టిన దేశవ్యాప్త సమ్మెను కార్మిక సంఘాలన్నీ ఏకతాటిపైకి వచ్చి జయప్రదం చేయాలని కోరారు. యూనియన్ ప్రెసిడెంట్ కురుమెళ్ల శ్రీను మాట్లాడుతూ ఆటో యూనియన్ సభ్యులందరూ ఎప్పటికప్పుడు తమ తమ ఆటోలను ఫిట్‌నెస్ ఇన్సూరెన్స్, లైసెన్సు ఆటోకు సంబంధించిన అన్ని పత్రాలు కలిగి ఉండాలన్నారు. ఈ సమావేశంలో ఆటో యూనియన్ సభ్యులు బీరం అంజి, కమ్మసిచ్చు రమేష్, లక్ష్మణ్, పరమేశ్వరరావు, అరుణ్, మజ్జి శ్రీను, తదితర యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

## ముగిసిన డిఎస్‌సి పరీక్షలు

**ప్రజాశక్తి - ఏలూరు అర్బన్**

మెగా డిఎస్‌సి-2025 పరీక్షలు బుధవారంతో ముగిశాయి. జూన్ ఆరో తేదీన ప్రారంభమైన పరీక్షలు జూన్ 30వ తేదీన ముగియాల్సి ఉండగా యోగా దినోత్సవం సందర్భంగా జూన్ 21, 22 తేదీల్లో పరీక్షలు జరగలేదు. ఆ పరీక్షలు ఈ నెల 1, 2 తేదీల్లో జరిగాయి. బుధవారం ఉదయం 9.30 గంటల నుంచి 12 గంటల వరకు సిద్ధార్థ క్వెస్ట్ పాఠశాలలో 180 మందికి 177 మంది హాజరు కాగా ముగ్గురు గైర్హాజరయ్యారు. సిఆర్.రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో 200 మందికి 194 మంది హాజరు కాగా ఆరుగురు గైర్హాజరయ్యారు. ఏలూరు ఇంజినీరింగ్ కళాశాలలో 140 మందికి 136 మంది హాజరయ్యారు. నలుగురు గైర్హాజరయ్యారు. మూడు కేంద్రాల్లో మొత్తం 520 మందికి 507 మంది హాజరు కాగా 13 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి ఐదు గంటల వరకు జరిగిన పరీక్షల్లో సిద్ధార్థ క్వెస్ట్ పాఠశాలలో 180 మందికి 168 మంది హాజరు కాగా 12 మంది గైర్హాజరయ్యారు. సిఆర్.రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో 156 మందికి 153 మంది హాజరు కాగా ముగ్గురు గైర్హాజరయ్యారు. ఏలూరు ఇంజినీరింగ్ కళాశాలలో 140 మందికి 133 మంది హాజరు కాగా ఏడుగురు గైర్హాజరయ్యారు. మూడు కేంద్రాల్లో 476 మందికి 454 మంది హాజరు కాగా 22 మంది గైర్హాజరయ్యారు. మొత్తం జూన్ ఆరో నుంచి బుధవారం వరకు జరిగిన పరీక్షల్లో 17,386 మందికి 16,154 మంది హాజరు కాగా 1,232 మంది గైర్హాజరయ్యారు.

# సంక్షేమ ప్రగతే కూటమి ప్రభుత్వ లక్ష్యం
### 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో మంత్రి కొలుసు పార్థసారథి



గ్రామస్తులతో మాట్లాడుతున్న మంత్రి కొలుసు పార్థసారథి

**ప్రజాశక్తి - నూజివీడు టౌన్**

ప్రతి ఇంటి సంక్షేమ ప్రగతే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. మండలంలోని పల్లెర్లమూడిలో సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికీ టిడిపి కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కూటమి ప్రభుత్వంలో అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చిన్నాభిన్నం చేశారని తెలిపారు. రాష్ట్ర విభజన నష్టం కంటే జగన్ ఐదేళ్ల పాలనలోనే ఎక్కువ నష్టం జరిగిందన్నారు. చంద్రబాబు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చక్కబెడుతూనే ప్రతి ఇంటికీ సంక్షేమాన్ని, ప్రగతిని అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారన్నారు. ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తీసుకొస్తున్నామన్నారు. రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.20 వేలు ఇవ్వబోతున్నామని తెలిపారు. పేదరికాన్ని పారద్రోలేలా మార్గదర్శకుల సహకారంతో పి4ను అమలు చేస్తున్నామన్నారు. ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అన్నింటినీ అమలు చేస్తూ, మంచి ప్రభుత్వం అని పేరు తెచ్చుకున్న ప్రభుత్వం తమది అని తెలిపారు. పెన్షన్ సొమ్ము పెంపు, తల్లికి వందనం కింద ప్రతి విద్యార్థికీ రూ.13 వేలు, డిఎస్‌సి ద్వారా 16 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి పరీక్షలు, అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణ, గుంతలు లేని రోడ్లు నిర్మించామన్నారు. ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామన్నారు. త్వరలో రైతు బంధు కింద రూ.20 వేలు అందిస్తామన్నారు. పామ్ ఆయిల్, కోకో, మిర్చి, పొగాకు, ఉద్యాన పంటల రైతులను ఆదుకొని వేల కోట్ల రుణాలు అందిస్తున్నామన్నారు. మామిడి రైతులకు రూ.4 రూపాయలు అదనంగా ఇచ్చామన్నారు. పల్లెర్లమూడి, సీతారామ పురం, మర్రిబందం గ్రామాల్లో కార్యక్రమం కొనసాగింది. మంత్రి వెంట అధికారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైద్యులు, సిబ్బంది జవాబుదారీతనంతో పనిచేయాలి
### జిల్లా ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో కలెక్టర్ వెట్రిసెల్లి, ఎంపీ మహేష్‌కుమార్

**ప్రజాశక్తి - ఏలూరు**

పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలన్న ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా వైద్యులు, వైద్య సిబ్బంది జవాబుదారీతనంతో పని చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఆదేశించారు. స్థానిక జిల్లా కలెక్టరేట్లోని గౌతమీ సమావేశపు హాలులో బుధవారం నిర్వహించిన ఏలూరు జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో చైర్ పర్సన్ కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌తో కలిసి సమీక్షించారు. ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి, దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్, ఆసుపత్రి వైద్యాధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ఆసుపత్రిలో కార్డియాలజీ విభాగం ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని, అల్ట్రాసౌండ్ స్కానింగ్, 2డి ఎకో వంటి రేడియాలజీ విభాగంలో వైద్యుల నియామకం చేపట్టాలని అంతవరకూ ప్రజల సేవలకు అంతరాయం కలగకుండా తాత్కాలిక విధానంలో వైద్యుల సేవలు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. ఎంపీ పుట్టా మహేష్ కుమార్ మాట్లాడుతూ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. వైద్య సేవల లోపం కారణంగా ఎటువంటి మరణం సంభవించకుండా డాక్టర్లు బాధ్యతాయుతంగా, జవాబుదారీతనంతో పనిచేయాలన్నారు. సదరంలో నమోదు చేసుకున్న వారికి వెంటనే ధ్రువీకరణ పత్రాలు అందించేలా చర్యలు తీసుకోవాలని, మెడికల్ రియింబర్సమెంట్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరిం టెండెంట్ డాక్టర్ శశిధర్, జిల్లా ఆసుపత్రి సేవల సమన్వయాధికారి డాక్టర్ పాల్ సతీష్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ మాలిని, రెడ్ క్రాస్ సొసైటీ ఏలూరు శాఖ ఛైర్మన్ డాక్టర్ ఎంబిఎస్‌వి. ప్రసాద్, జిల్లా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, ఆసుపత్రిలోని వివిధ విభాగాల వైద్యాధికారులు పాల్గొన్నారు.

## నేడు జిల్లాలో రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్మన్ పర్యటన

**ప్రజాశక్తి - ఏలూరు**

రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్మన్ డాక్టర్ రాయపాటి శైలజ ఈ నెల మూడో తేదీ ఉదయం 11 గంటలకు హనుమాన్ జంక్షన్ చేరుకుని శక్తి సదన్ సందర్శిస్తారు. 11:30 హనుమాన్ జంక్షన్ నుంచి బయలుదేరి ముసునూరు వెళ్లి అక్కడ గురుకుల పాఠశాలను పరిశీలిస్తారు. భోజన అనంతరం మధ్యాహ్నం ఒంటిగంటకు ముసునూరు నుంచి బయలుదేరి ఏలూరు చేరుకుని ప్రభుత్వాసుపత్రిలో ఉన్న వన్ స్టాప్ సెంటర్‌ను సందర్శిస్తారు. అనంతరం వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌ను సందర్శిస్తారు. మధ్యాహ్నం 3:30 గంటలకు దెందులూరు చేరుకుని బాలసదనం సందర్శిస్తారు. అనంతరం సాయంత్రం 4:30 గంటలకు దెందులూరు నుంచి బయలుదేరి తాడేపల్లి వెళ్తారు.

## పట్టాలు ఇవ్వకపోవడం పేదల ఎదుగుదలను అడ్డుకోవడమే
### పదో రోజుకు తరుగుమూల ఇళ్లస్థలాల లబ్ధిదారుల దీక్షలు

దీక్షలో పాల్గొని మద్దతు తెలిపిన డివిఎన్‌విడి.ప్రసాద్

**ప్రజాశక్తి - మండవల్లి**

పేదలకు పట్టాలు ఇవ్వకపోవడం పేదల ఎదుగుదలను అడ్డుకోవడమేనని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డివిఎన్‌విడి.ప్రసాద్ విమర్శించారు. మా పట్టాలు ఇవ్వాలని కోరుతూ తరుగుమూల ఇండ్ల స్థలాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి పదవ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలకు ఆయన మద్దతు పలికి మాట్లాడారు. పేదలకు పట్టాల పంపిణీ చేయడంలో అధికారులు, నాయకుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందన్నారు. పేదల ఎదుగుదల సహించలేకే 20 ఏళ్లుగా పేద లబ్ధిదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. అంతేకాకుండా ఏళ్ల క్రితం ఇచ్చిన పట్టాలను ఇప్పుడు వెరిఫికేషన్ చేసి పట్టాలను ఇస్తామనడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికే సొంత ఇంటి కల కోసం ఎంతోమంది కుటుంబాల వారు ఎదురుచూసి మృతి చెందారన్నారు. అయినప్పటికీ వారిపట్ల జాలి చూపకపోగా కక్ష పూరిత చర్యలకు పాల్పడడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే వెరిఫికేషన్ లేకుండా పోలీస్ స్టేషన్ ఏర్పాటుతో నిమిత్తం లేకుండా పంటలను పంపిణీ చేసి ఆ స్థలాలు మెరక చేసి ఇళ్లు నిర్మించుకునేలా చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యమాన్ని జిల్లా స్థాయికి తీసుకెళ్లి అధికారులపై ఒత్తిడి తెస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సింహాచలం, పద్మ, వెంకటేశ్వరమ్మ, లక్ష్మి, సుజాత, వెంకటేశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసేవలో భాగస్వాములవ్వాలి

**రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి**

**పల్లెర్లమూడిలో వాటర్‌ప్లాంట్, బస్‌షెల్టర్ ప్రారంభం**

**ప్రజాశక్తి - నూజివీడు టౌన్**

ప్రజాసేవలో కార్పొరేట్ సంస్థలు, ప్రయివేట్ వ్యక్తుల భాగస్వాములు కావడం అభినందనీయమని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని పల్లెర్లమూడి గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికి తెలుగు దేశం కార్యక్రమంలో భాగంగా టిడిపి గ్రామ నాయకులు డి.కృష్ణమోహన్ దవులూరి ఫౌండేషన్ ద్వారా రూ.8.50 లక్షలతో నిర్మించిన బస్ షెల్టర్, మంచినీటి ప్లాంటును మంత్రి కొలుసు పార్థసారథి ప్రారంభించారు. గ్రామంలో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిసి కృష్ణమోహన్ తమ ఫౌండేషన్ ద్వారా రూ.8.50 లక్షలతో తాగునీటి ప్లాంటు నిర్మించారు. గ్రామ ప్రజలకు, పంచాయతీకి తాగునీరు నామమాత్రపు రుసుముకు అందించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ గ్రామానికి చెందిన కృష్ణమోహన్ రూ.8.50 లక్షలతో తాగునీటి ప్లాంటు, బస్‌షెల్టర్ నిర్మించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. గ్రామ ప్రజల ఆరోగ్యం కోసం వాటర్ ప్లాంటు నిర్మించారన్నారు. ఇది వారి దాతృత్వానికి నిదర్శనమన్నారు. సమాజంలో ఆర్థికంగా ఎదిగిన వ్యక్తులు సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావడం నిజంగా అభినందించదగిన విషయమన్నారు. ఇలాంటి దాతృత్వం కలిగిన వ్యక్తులు ఇంకా ముందుకొచ్చి రాష్ట్రాభివృద్ధికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో దవులూరి కృష్ణమోహన్, కాపా శ్రీను, జి.మధు, వాసు, వి.భాస్కర్, తహశీల్దార్, మండల అధికారులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## 9న సమ్మెను జయప్రదం చేయాలి

**ప్రజాశక్తి - ఏలూరు అర్బన్**

ఈ నెల తొమ్మిదో తేదీన దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ స్థానిక వివి.నగర్ మార్కెట్ యార్డ్ హమాలీ వర్కర్స్ యూనియన్ కార్యాలయం వద్ద ఐఎఫ్‌టియు రాష్ట్ర కమిటీ ముద్రించిన కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డ్ హమాలీ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ సార్వత్రిక సమ్మెలో కార్మిక వర్గం పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. మోడీ తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, హమాలీ కార్మికులకు ఉపాధి భద్రతతో కూడిన చట్టాన్ని ప్రవేశపెట్టాలని, సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మీసాల రమణ, మంగరాజు రాము, కోరాడ అప్పారావు, సూరిబాబు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

**జంగారెడ్డిగూడెం :** ఈ నెల తొమ్మిదో తేదీన చేపట్టిన దేశవ్యాప్త సమ్మెలో అన్ని సంఘాలా కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు పట్టణ అధ్యక్షులు పి.సూర్యారావు కోరారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో బుధవారం సిఐటియు పట్టణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సూర్యారావు మాట్లాడారు. ఈ సమావేశంలో అంగన్‌వాడీ నాయకలు జి.విమల, శిరోమణి, మున్సిపల్ నాయకులు ఆర్.నాగరాజు, బి.బాలరాజు, ఆటో నాయకులు పి.సత్తిబాబు, డి.ఆశీర్వాదం, ఆర్‌టిసి నుంచి జిఎస్.నారాయణ, స్థానిక నాయకులు వి.గోపీ, ఎన్‌వి.రావు పాల్గొన్నారు.

## నేడు ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యం నిరసన

**ప్రజాశక్తి - ఏలూరు**

రాష్ట్రంలోని అన్ని ప్రయివేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల తరఫున, ప్రయివేట్ పాఠశాలల గుర్తింపు పునరుద్ధరణను ఎనిమిదేళ్ల నుంచి పదేళ్లకు పొడిగించినందుకు, ప్రతిభా అవార్డుల్లో విద్యార్థులను చేర్చినందుకు, తల్లికి వందనం ఇచ్చినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి అపుస్మా సెక్రటరీ ఎన్‌ఆర్‌కెఎ.ప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే ప్రయివేట్ పాఠశాలలపై తీసుకుంటున్న ఏకపక్ష చర్యలకు నిరసనగా ఈ నెల మూడో తేదీన అన్ని ప్రయివేట్ పాఠశాలలు మూసివేసి నిరసన తెలుపుతున్నట్లు తెలిపారు. అధికారులు ప్రయివేట్ పాఠశాలలపై అతిగా స్పందించడం, త్రీమేన్ కమిటీలు తనిఖీలు చేయడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఏకపక్ష వార్తలు, తప్పుడు ఫిర్యాదుల ఆధారంగా నోటీసులు జారీ చేయడం, ఫీల్డ్ అధికారుల నుంచి అగౌరవకరమైన సందేశాలు, హెచ్చరికల వంటి సందేశాలు ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాన్ని తీవ్ర ఆవేదనకు గురి చేస్తున్నాయని తెలిపారు. షోకాజ్ నోటీసులతో వేధించడం గుర్తింపు రద్దు చేస్తామని బెదిరించడం వంటి చర్యలకు ప్రతి స్పందనగా అన్ని ప్రయివేట్ పాఠశాలలు మూసి వేసి నిరసన తెలుపుతున్నట్లు ఆయన తెలిపారు.

**టి.నరసాపురం :** ప్రయివేట్ పాఠశాలలపై ప్రభుత్వం తీసుకుంటున్న ఏకపక్ష చర్యలకు నిరసనగా ఈ నెల మూడో తేదీన అన్ని ప్రయివేట్ పాఠశాలలు మూసివేసి నిరసన తెలుపుతున్నట్లు అపుస్మా జిల్లా జాయింట్ సెక్రటరీ బిఎన్.సాగర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## విద్యావ్యవస్థలో సమూల మార్పులే లక్ష్యం

**ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి**

**ప్రజాశక్తి - ఏలూరు సిటీ**

విద్యావ్యవస్థలో సమూల మార్పులే లక్ష్యంగా ముందుకెళ్తున్న కూటమి ప్రభుత్వం విద్యార్థులకు అనేక పథకాలను పటిష్టవంతంగా అమలు చేస్తుందని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి చెప్పారు. ఏలూరులోని పలు పాఠశాలలను ఎంఎల్ఎ బడేటి చంటి బుధవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో సందర్శించారు. తొలుత స్థానిక 12 పంపుల సెంటర్‌లోని గాంధీనగర్ - నగరపాలకోన్నత పాఠశాలను, ఆర్ఆర్.పేటలోని ఈదర సుబ్బమ్మ దేవి పాఠశాలనుతనిఖీ చేశారు. అక్కడ కొనసాగుతోన్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. అనంతరం ఆర్ఆర్.పేటలోని ఈదర సుబ్బమ్మదేవి నగరపాలకొన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరులో లోటుపాట్లు ఉన్నాయంటూ తనకు సామాజిక మాధ్యమం ద్వారా అందిన ఫిర్యాదుపై స్పందించి ఆ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వైద్యులకు సత్కారం

**ప్రజాశక్తి - దెందులూరు**

అతి తక్కువ ఫీజుతో పేదలకు అన్ని వేళలా నాణ్యమైన వైద్యం అందిస్తున్న ప్రముఖ ప్రభుత్వాసుపత్రి న్యూరాలజీ వైద్యుడు రవికుమార్, ప్రముఖ వైద్యురాలు షాలినిలు కలకలం జనం హృదయాల్లో నిలచిపోతారని ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. డాక్టర్స్ డేను పురస్కరించుకుని ఏలూరులోని రవి న్యూరో కేర్ ఆసుపత్రి ప్రాంగణంలో డాక్టర్స్ డే వేడుకలు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మానవత స్వచ్ఛంధ సంస్థ ప్రతినిధి మేతర అజయ్ బాబు, దళిత నాయకులు మున్నుల జాన్ గురునాథ్, కందుల రమేష్, బిఎస్‌పి రాష్ట్ర నాయకులు నేతల రమేష్, జిల్లా యాదవ్ సంఘం నాయకులు సూర్యనారాయణ, ఎపిఎస్ ఎస్ఎస్ మాజీ డైరెక్టర్ అబ్రహం, టిడిపి సీనియర్ నాయకులు ఆర్ఎన్ఆర్.నాగేశ్వరరావు, తదితరులు డాక్టర్ రవి, డాక్టర్ షాలినిలకు పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కోసి స్వీట్లు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు కలపాల రవి, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## సాగునీరు విడుదల

**ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం**

మండలంలోని కొంగువారిగూడెం వద్ద ఉన్న కరాటం కృష్ణమూర్తి జలాశయం నుంచి వ్యవసాయానికి సాగునీరు విడుదల చేశారు. రైట్ కెనాల్ గేట్లు కరాటం రాంబాబు, లెఫ్ట్ కెనాల్ గేట్లు టిడిపి పట్టణ అధ్యక్షులు కొంర్రెడ్డి కిషోర్ గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ నుంచి డిఇ ఎఇ, సిబ్బంది, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ చిట్టిబోయిన రామలింగేశ్వరావు, కోనేరు చంటి, కరణం రాంబాబు, కంఠమనేని సూర్యనారాయణ, శీలమంతుల రాంబాబు, గద్దె జస్వంత్, మండల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## నేరాలు - ఘోరాలు

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

**జంగారెడ్డిగూడెం :** రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయాలపాలైన ఘటన మండలంలోని వేగవరంలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాల ప్రకారం.. అశ్వారావుపేట వైపు నుంచి రాజమండ్రి వెళ్తున్న సిమెంట్ లోడ్ లారీ వేగవరం వద్దకు వచ్చేసరికి రోడ్డుపై స్పీడ్‌బ్రేకర్లు ఉండడంతో డ్రైవర్ సడన్ బ్రేక్ వేయగా వెనుకగా వచ్చిన లారీ ఎదురుగా ఉన్న లారీని ఢీకొట్టింటి. దీంతో రెండు లారీలు రోడ్డు పక్కన ఉన్న దుకాణాల్లోకి వెళ్లాయి. దుకాణంలో ఉన్న వేగవరం గ్రామానికి చెందిన కొప్పర్తి నాగేంద్రబాబును లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతని, ఒక లారీ డ్రైవర్ గాయాలపాలయ్యారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. క్షతగాత్రులను సిఐ వాహనంలో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న రెండు దుకాణాలు కొంతమేర ధ్వంసమై ఆస్తి నష్టం వాటిల్లినట్లు దుకాణాల యజమానులు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

# ఖాళీ వైద్యుల పోస్టులను భర్తీ చేయరూ..!

**21లో 15 పోస్టులు ఖాళీ**

**చింతలపూడి ఏరియా ఆసుపత్రి దుస్థితి**

**భర్తీ చేయాలని మండలవాసుల వేడుకోలు**

**ప్రజాశక్తి - చింతలపూడి**

చింతలపూడి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వైద్యుల పోస్టులను అధికారులు భర్తీ చేయడంలేదని మండల ప్రజలు వాపోతున్నారు. ఉన్న వైద్యులను బదిలీపై పంపిస్తున్నారని, డిప్యూటేషన్‌పై వెళ్లిన వారిని వెనక్కి తీసుకురావడంలేదని చెబుతున్నారు. ఉన్న వైద్యులు వెళ్లిపోవడంతో, కొత్త వైద్యులు చింతలపూడి రావటానికి ఆసక్తి చూపించకపోవటటంతో ఆసుపత్రిలో వైద్య సేవల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారిందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

ఏరియా ఆసుపత్రిలో 21 మంది వైద్యులకు 15 పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. డిప్యూటీ సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ జివై వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్నారు. సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ జిఎస్ మెడికల్ లీవ్‌పై ఉన్నారు. ప్రస్తుతం ఆసుపత్రి నుంచి బదిలీపై ఎముకల వైద్య నిపుణులు, అనాస్తీషియ బయటకు వెళ్తున్నారు. వీరి స్థానాల్లో ఇంకా ఎవరిని నియమించలేని పరిస్థితి. ప్రస్తుతం ముగ్గురు ఎంబిబిఎస్ వైద్యులు, ఐదుగురు పీజీ వైద్యులు సేవలను అందిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న గైనకాలాజిస్ట్ పది రోజుల్లో బదిలీపై వెళ్తనట్లు తెలుస్తుంది. బదిలీ పోస్టు ఖాళీలు భర్తీ చేయటం లేదు. చర్మ వైద్య నిపుణులు డిప్యూటేషన్‌పై బయటకు వెళ్లారు. స్టాఫ్ నర్సుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉన్న వైద్యులు బదిలీపై వెళ్లిపోతున్నారు. కొత్త వైద్యులు చింతలపూడి రావడానికి ఆసక్తి చూపించడంలేదు. దీంతో చింతలపూడి ఏరియా ఆసుపత్రి పరిస్థితి ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారింది. ప్రస్తుతం ఉన్న వైద్యులు మధ్యాహ్నం ఒంటి గంట లేదా 1.30 గంటల వరకు మాత్రమే సేవలందిస్తున్నారని రోగులు చెబుతున్నారు. సాయంత్రం నాలుగు గంటల వరకు సేవలు

అందించాల్సి ఉన్నా భోజనం తర్వాత ఇంటికి వెళ్లి రావటం లేదని రోగులు వాపోతున్నారు.

**జిల్లా అధికారులకు తెలియజేశాం**

**నారాయణరావు, ఆసుపత్రి సూపరింటెండెంట్**

చింతలపూడి ఏరియా ప్రభుత్వాసుపత్రికి 15 మంది వైద్యుల కొరత ఉంది. ఉన్న వైద్యులతోనే ప్రజలకు మెరుగైన వైద్య సేవలందిస్తున్నాం. ఖాళీగా ఉన్న పోస్టుల గురించి జిల్లా అధికారులకు తెలియజేశాం.

## ఆర్‌జియుకెటిలో ప్రవేశాలకు అడ్మిషన్లు

**ప్రజాశక్తి - నూజివీడు టౌన్**

ఆర్‌జియుకెటి పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, శ్రీకాకుళం, ఒంగోలు క్యాంపస్‌లకు 2025-26 సంవత్సరానికి జూన్ 30 నుంచి ఈ నెల ఐదో తేదీ వరకు అడ్మిషన్లు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఈ నెల 2, 3 తేదీల్లో శ్రీకాకుళం క్యాంపస్ కోసం మొదటి రోజు నూజివీడు ఎస్ఎసి ఆడిటోరియంలో అడ్మిషన్ల ప్రక్రియ మొదలైంది. 516 మందికి కాల్ లెటర్స్ పంపించగా 444 మంది రిపోర్ట్ చేశారు. రాత్రి నుంచి వర్షం పడుతున్నా విద్యార్థులకు ఏ విధమైన ఇబ్బంది కలగకుండా క్యాంపస్‌కు చేరుకోవడానికి అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి అడ్మిషన్ల ప్రక్రియ మొదలైంది. విద్యార్థులను ఉద్దేశించి శ్రీకాకుళం డైరెక్టర్ ఆచార్య కెవిజిడి.బాలాజీ మాట్లాడుతూ శ్రీకాకుళం క్యాంపస్‌లో అడ్మిషన్లు పొందడం అభినందనీయమని, ఇక్కడ కల్పించే సౌకర్యాలను వాడుకుని విద్యార్థులు ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆయన కోరారు. అనంతరం శ్రీకాకుళం క్యాంపస్‌లో సీటు పొందిన జాహ్నవి, ప్రవీణ్, కావ్యశ్రీ, కావ్యలను అభినందించి వారికి ధ్రువీకరణ పత్రాలు అందించారు.

## అందరి భాగస్వామ్యంతోనే డెంగీ అంతం

**డిఎంహెచ్‌ఒ మాలిని**

**ప్రజాశక్తి - ఏలూరు సిటీ**

డెంగీ జ్వరాలు మానవాళికి పెనుముప్పుగా పరిణమించాయని, డెంగీని అంతం చేయడానికి అందరూ భాగస్వాములు కావాలని డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఆర్.మాలిని సూచించారు. జాతీయ డెంగీ వ్యతిరేక మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా ఏలూరు జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయం నుంచి ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాలిని మాట్లాడుతూ డెంగీ, మలేరియా దోమలు మంచినీటి నిల్వ ప్రాంతాల్లో ఎక్కువగా పెరుగుతాయన్నారు. వారానికోసారి కడిగి మూతలు పెట్టుకోవాలని సూచించారు. తీవ్రమైన జ్వరం, కండరాల నొప్పులు ఉంటే సంబంధిత వైద్యులను సంప్రదించాలని చెప్పారు. జిల్లా మలేరియా అధికారి పిఎస్.ప్రసాద్ మాట్లాడుతూ నీటి నిల్వ ప్రాంతాలను శుభ్రం చేసుకోవాలని చెప్పారు. ప్రతిజ్ఞ చేసి మానవహారం చేసి పాత బస్టాండ్ వరకు డెంగీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా స్థాయి ల్యాబ్ టెక్నీషియన్ల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ శోభ, పరిపాలనాధికారి డాక్టర్ గంగాభవాని, అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు, పందిరి శ్రీనివాసరావు, ల్యాబ్ టెక్నీషియన్స్, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులకు ధాన్యం సొమ్ము చెల్లించాలి

**రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్**

**ప్రజాశక్తి - ఏలూరు అర్బన్**

ధాన్యం అమ్మి రెండు నెలలవుతున్నా అన్నదాతలకు ధాన్యం సొమ్ములు చెల్లించకపోవడం అన్యాయమని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ విమర్శించారు. ఏలూరు అన్నే భవనంలో రైతాంగ సమస్యలపై ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. రైతులు, కౌలు రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మి రెండు నెలలు గడిచిపోతున్నా ధాన్యం సొమ్ములు చెల్లించకపోవడం వల్ల అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ధాన్యం అమ్మిన 24 గంటల్లో ధాన్యం సొమ్ములు చెల్లిస్తున్నామని గొప్పగా చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం రూ.వందల కోట్లు రబీ ధాన్యం సొమ్ములు రైతులకు ఎందుకు చెల్లించలేదని ప్రశ్నించారు. ఖరీఫ్ వ్యవసాయ సీజన్ ప్రారంభం కావడంతో పెట్టుబడికి చేతిలో చిల్లి గవ్వలేక అన్నదాతలు అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ధాన్యం బకాయి సొమ్ములు చెల్లించి అన్నదాతలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

**ఆయిల్ పామ్ గెలల ధర పడిపోవడం పట్ల ఆందోళన**

కేంద్ర ప్రభుత్వం పామాయిల్ దిగుమతి సుంకం పది శాతం తగ్గించడం వల్ల ఆయిల్ పామ్ గెలల ధర పడిపోయి రైతులు నష్టపోతున్నారని చెప్పారు. దిగుమతి సుంకం పెంచి టన్ను ఆయిల్ పామ్ గెలల ధర రూ.20 వేలు తగ్గకుండా ఉండేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. దిగుమతి సుంకం పెంచేలా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి చేయాలని కోరారు. పెదవేగి ఆయిల్ ఫెడ్ కర్మాగారం ప్రయివేటీకరణ చర్యలు ఆపాలన్నారు. ఆయిల్ ఫెడ్ కర్మాగారం ప్రయివేటీకరణకు రైతులు సంఘటితం కావాలని కోరారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకటకృష్ణారావు పాల్గొన్నారు.

## హన్నస్ అంకుల్ సామ్ ప్రారంభం

**ప్రజాశక్తి - నూజివీడు టౌన్**

పట్టణంలోని చిన్న గాంధీ బొమ్మ సమీపంలో బుధవారం హన్నస్ అంకుల్ సామ్ కంప్లీట్ ఫుడ్ ప్లాజాను మున్సిపల్ వైస్ ఛైర్మన్ పగడాల సత్యనారాయణ, కోరమండల్ పెయింట్స్ మేనేజర్ నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ పరిసర ప్రాంతాల్లో మునుపెన్నడూ లేని విధంగా ప్రజాభీష్టం మేరకు అద్భుతమైన వంటకాలను రుచి చూపించేందుకు సిద్ధం కావడం అభినందనీయమన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, సుచి, శుభ్రత రుచులతో అన్ని రకాల ఆహార పదార్థాలు అందించాలన్నారు. నేటి సమాజంలో చిన్నారులు, యువతరం నుంచి పెద్దల వరకు నచ్చే, వారు మెచ్చే రీతిలో వంటకాలను అందించి అందరి ఆదరాభిమానాలు పొందడం ద్వారా దినదినాభివృద్ధి సాధించాలని అభిలాషించారు. హన్నస్ అంకుల్ సామ్ కంప్లీట్ ఫుడ్ ప్లాజాను ఎంతో అభివృద్ధితో నేటి తరం

ఫుడ్‌ప్లాజాను ప్రారంభిస్తున్న సత్యనారాయణ, నాయుడు

మెచ్చేలా ఏర్పాటు చేసి నూజివీడు పట్టణ ప్రాంత ప్రజానీకాన్నే ఆశ్చర్య చకితులను చేశారని అన్నారు. హన్నస్ అంకుల్ సామ్ అధినేతలైన షేక్ నవాజ్, పామర్తి ఫణి ఒక సంస్థలో ఉద్యోగాలు చేసే స్థాయి నుంచి వారే ఓ సంస్థను నిర్మించి అధినేతలుగా ఎదిగి మరికొందరు యువకులకు ఉపాధి కల్పించే స్థాయిలో నిలబడటం ఎంతో గర్వంగా ఉందన్నారు. నేటి యువతరం వీరిని స్ఫూర్తిగా తీసుకుని ఎదగాలన్నారు.

## చెత్త సేకరణ సక్రమంగా చేపట్టాలి

**ప్రజాశక్తి - ముసునూరు**

చెత్త సేకరణ సక్రమంగా చేపట్టి గ్రామ పంచాయతీకి ఆదాయం తీసుకురావాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపిడిఒ బసవరాజు అచ్యుత సత్యనారాయణ సూచించారు. మండల కేంద్రమైన ముసునూరు గ్రామంలో చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందరేగా గ్రామంలో చెత్త కార్మికులు చెత్త సేకరణ ఎలా చేస్తున్నారో ? సందర్శించి గ్రామంలోని సంపద పరిశోధన కేంద్రాన్ని అభివ ద్ధి చేయాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు ఆరేపల్లి వెంకటేశ్వరరావు, నీరజ నాయుడు, కే సుజాత, ధర్మవతి పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**సుపరిపాలనలో తొలిఅడుగు ప్రారంభం**

**ప్రజాశక్తి - దెందులూరు**

సిఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విస్తృత ప్రచారం ద్వారా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ టిడిపి శ్రేణులకు పిలుపునిచ్చారు. పెదవేగి మండలం లక్ష్మీపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయాలన్నారు.

**ఏలూరు సిటీ :** సిఎం చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యపడుతుందని ఎంపీ పుట్టా మహేష్‌కుమార్, ఎంఎల్ఎ బడేటి చంటి, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు తెలిపారు. ఏలూరు ఎంఆర్‌సి కాలనీలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని ఎంపీ ప్రారం భించారు. మున్సిపల్ కార్పొరేషన్ చైర్ పర్సన్ షేక్ నూర్జహాన్, ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఆర్‌టిసి జోన్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, అధికారులు, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు.

**ముసునూరు :** మండలంలోని చెక్కపల్లి, కాట్రేనిపాడు, ముసునూరు గ్రామాల్లో పార్టీ మండలాధ్యక్షులు గద్దె రఘుబాబు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి ప్రధాన కార్యదర్శి పాకనాటి సీతారాం, టిడిపి నాయకులు మెదరమెట్ల



ఏలూరులో...

పెదవేగిలో...

సురేంద్ర, మండలపు ధర్మరాజు, పులి బళ్ల సత్యనారాయణ, కాటేపల్లి ప్రసాద్, కాటేపల్లి పెదబాబు, చిలుకూరు వెంకటేశ్వరరావు, తలిబోయిన సత్యనారాయణ, గద్దల మోహన్‌రావు, రాపర్ల బాలకృష్ణ, సూర్యదేవర శ్రీనివాసరావు, పార్టీ గ్రామ అధ్యక్షులు, బూత్, యూనిట్ ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు.

**నూజివీడు టౌన్:** పట్టణంలోని 32వ వార్డులో, పెట్రోల్ బంక్ ఏరియాలో వార్డు ఇన్‌ఛార్జి, నూజివీడు ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్ గొల్లు దుర్గాదేవి నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి, ఇప్పటివరకు అమలుపరిచిన సంక్షేమ పథకాలను ఆమె, వార్డు కమిటీ సభ్యులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రెసిడెంట్ వాకా రాంబాబు, ప్రధాన కార్యదర్శి దుబ్బిరెడ్డి శ్రీనివాసరావు, వార్డ్ మెంబర్ సిరికి కార్తీక్ పాల్గొన్నారు.

**జంగారెడ్డిగూడెం :** టిడిపి పట్టణ అధ్యక్షులు కొంర్రెడ్డి కిషోర్ అధ్యక్షతన కాకర్ల కాంప్లెక్స్ వద్ద ఉన్న నందమూరి తారక రామారావు విగ్రహానికి సీనియర్ నాయకులు మండల లక్ష్మణరావు, పరిమి సత్యనారాయణ, రావూరి కృష్ణ, అల్లూరి రామకృష్ణ, కౌన్సిలర్లు కరుటూరి రమాదేవి, తెలగారపు జ్యోతి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. 16, 17వ వార్డుల్లో 'సుపరిపాలనలో తొలి అడుగు కార్యాక్రమం నిర్వహించారు.

**మండవల్లి :** మండలంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని బుధవారం టిడిపి కన్వీనర్ వీరమల్లు నరసింహారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మండవల్లిలో ఇంటింటికి తిరుగుతూ ఏడాది పాలనలో ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నరసింహారావు, పార్టీ మండలాధ్యక్షుడు నాగేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి కోనపరెడ్డి కోటేశ్వరరావు, కో క్లస్టర్ ఇన్‌ఛార్జి గోల్కొండ చంద్రశేఖర్, బూత్ కన్వీనర్ గుడివాడ గణేష్, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**చింతలపూడి :** మండలంలోని ప్రగడవరంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా టిడిపి ప్రగడవరం గ్రామ కమిటీ అధ్యక్షులు తాళ్లూరి చంద్రశేఖర్ రెడ్డి, ఎంపిటిసి మాజీ సభ్యులు రాజశేఖర్‌రెడ్డి మాట్లాడారు. ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో అమలుపరిచిన హామీలు, సంక్షేమం, అభివృద్ధి గురించి వివరించారు. ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు. చింతలపూడి నగర పంచాయతీలో టౌన్ అధ్యక్షులు తాటి అప్పారావు ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు.

## పలుచోట్ల 'పొలం పిలుస్తోంది'

**ప్రజాశక్తి - ఉంగుటూరు**

ఉంగుటూరు-1 గ్రామ రైతు సేవా కేంద్రం వద్ద పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ భాషా మాట్లాడుతూ ఖరీఫ్ పంట కాలంలో కొత్త వరి వంగడాలను ప్రోత్సహించాలని, తద్వారా అధిక దిగుబడి పొందవచ్చని తెలిపారు. క్షేత్ర సందర్శనలో భాగంగా మండలంలో వరి నాట్లు, నారుమడులను పరిశీలించారు. భీమడోలు సహాయ వ్యవసాయ సంచాలకులు పి.ఉషా రాజ కుమారి, మండల వ్యవసాయాధికారి ఎన్ఎస్.ప్రవీణ్‌కుమార్ మత్స్య శాఖ మండల అధికారి మంగారావు పశు వైద్యురాలు శిరీష, సర్పంచి బండారు సింధు పాల్గొన్నారు.

**ముసునూరు :** ఖరీఫ్ సీజన్‌లో వరి పంట నాటే ముందు ప్రతి రైతూ పచ్చి రొట్ట విత్తనాల ద్వారా పెట్టుబడి తగ్గించుకోవచ్చని మండల వ్యవసాయాధికారి ఎ.చాముండేశ్వరి అన్నారు. మండలంలోని కాట్రేనిపాడులో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గద్దల సుహాసిని మోహనరావు, డిసి ఛైర్మన్ రాపర్ల బాలకృష్ణ, టిడిపి నాయకులు సూర్యదేవర శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

**జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ**

**'e' ప్రొక్యూర్మెంటు టెండర్ నోటీసు**

ఆర్.ఓ.సి. నెం. 39/2025-ఇ.1. ది. 02-07-2025

జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ పరిధిలో ఈ దిగువ తెలిపిన పనులు చేపట్టుటకు 'ఇ' ప్రొక్యూర్‌మెంటు ద్వారా టెండరులు పిలువబడుచున్నది.

| వ.నెం. | పని వివరము | పనుల సంఖ్య | ECV (రూ.లక్షలలో) |
| --- | --- | --- | --- |
| 1 | జంగారెడ్డిగూడెం పురపాలక సంఘ పరిధిలోని వివిధ వార్డులలో అభివృద్ధి పనులు రోడ్లు & డ్రైన్లు వేయుట | 6 | 53.5 |

సంబంధిత వివరములు https:\tender.epeprocurement.gov.in వెబ్ సైటు నందు ది. 03-07-2025 వ తేది ఉదయం గం. 10-00 ల నుండి చూడవచ్చును. ఇతర వివరములకు మున్సిపాలిటీ కార్యాలయము, ఇంజనీరింగ్ విభాగము నందు సంప్రదించగలరు.

సం/- **కమీషనర్**
జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ.

## ఉపాధ్యాయులకు సత్కారం

**ప్రజాశక్తి - మండవల్లి**

ఉపాధ్యాయ వృత్తి గౌరవ ప్రదామైందని సర్పంచి మెండ ఝాన్సీ, విద్యా కమిటీ మాజీ ఛైర్మన్ ముళ్లపూడి సత్తిబాబు స్పష్టం చేశారు. బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల కోసం చట్టాలను చేసే ప్రజాప్రతినిధులను ప్రజలకు సేవ చేసే అధికారులను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనన్నారు. అలాంటి ఉపాధ్యాయులకు వృత్తిలో బదిలీలు అనేవి సహజమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో అన్నదానం

**ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం**

స్థానిక సూర్యకిరణ్ ఫంక్షన్ హాల్స్ అధినేత డాక్టర్ రాజాన సత్యనారాయణ, వెంకట రామలక్ష్మి దంపతుల పెళ్లి రోజు సందర్భంగా స్థానిక వంద పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో శ్రీ సత్యసాయి ఉచిత నిత్యాన్నసేవా పథకం ద్వారా అన్నదానం చేశారు. శ్రీ నూకాలమ్మ ఆలయ కమిటీ సభ్యులు, వెలమ సంక్షేమ సంఘం సభ్యులు సంయుక్తంగా ఆలయ శాశ్వత ఛైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ, వెంకట రామలక్ష్మి దంపతులకు పెళ్లి రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాజాన దంపతులను సత్కరించారు.

## ఘనంగా విద్యాసాగర్ పుట్టినరోజు

**ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం**

జంగారెడ్డిగూడెంలో వైసిపి సీనియర్ నాయకులు విద్యాసాగర్ పుట్టినరోజు వేడుకలు పార్టీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్ బాబు, మచిలీపట్నం పరిశీలకులు జెట్టి గురునాధరావు, జెడ్‌పిటిసి సభ్యులు పోల్నాటి బాబ్జి, మండవల్లి విజయ సారధి, బివిఆర్.చౌదరి, పట్టణ అధ్యక్షులు చిటికెల అచ్యుతరామయ్య, వైస్ ఛైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, కంచర్ల వాసవి విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీని కలిసిన సొసైటీ అధ్యక్షురాలు

**ప్రజాశక్తి - కొయ్యలగూడెం**

ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌ను దిప్పకాయలపాడు వ్యవసాయ పరపతి సహకార సంఘం అధ్యక్షురాలిగా ఎన్నికైన యనమదుల దుర్గామాధురి ఏలూరు పార్టీ కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీ మహేష్ కుమార్ యాదవ్‌కు, ట్రెకర్ ఛైర్మన్ శ్రీనిశీనివాస్‌లకు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## సిపిఐ జిల్లా మహాసభ జయప్రదానికి పిలుపు

**ఏలూరు అర్బన్ :** సిపిఐ జిల్లా ద్వితీయ మహాసభ ఈ నెల 5, 6, 7 తేదీల్లో చింతలపూడిలో జరుగుతున్నాయని జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య తెలిపారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదో తేదీన చింతలపూడిలో వేలాది మందితో ప్రజా ప్రదర్శన, బహిరంగ సభ జరుగుతుందని ఆయన తెలిపారు. ఆరు, ఏడు తేదీల్లో చింతలపూడి మండలం ఎర్రగుంటపల్లిలో ప్రతినిధుల సభ రాధాకృష్ణ గార్డెన్స్ లో జరుగుతుందని చెప్పారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు బండి వెంకటేశ్వరరావు, జిల్లా సహాయ కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ పాల్గొన్నారు.

**CHANGE OF NAME**

I, **PAMULA RAVI PRASAD** S/o. Pamula Purushottam, D.No.6-11/1, Jettipalem, Ramanna Palem Post, Mogalthur Mandal, W.G.Dt. I have changed my name from **PAMULA RAVIKUMAR** (Old name) to **PAMULA RAVI PRASAD** (New name) hence forth I am being called **PAMULA RAVI PRASAD** S/o. Pamula Purushottam, for all purposes.

**పాస్‌పోర్ట్ పోయినది**

ఏలూరు జిల్లా, పెదవేగి మండలం, కె.కన్నాపురం గ్రామానికి చెందిన పాల హరికృష్ణ, తండ్రి: వెంకటేశ్వరరావు అను నేను ది. 22-06-2025 వ తేది ఏలూరు వ్యక్తిగత పనులపై వెళ్లి తిరిగి కె.కన్నాపురం వస్తుండగా సాయంత్రం గం. 5-30 ని॥లకు ముందూరు - ఏడవమైలు మధ్య నా బ్యాగు జారి పడిపోయింది. అందులో గల నా పాస్‌పోర్ట్ నెంబర్: **N1720895** కూడా జారి పడింది. ఎవరికైనా దొరికినచో ఈ క్రింది అడ్రస్ కు తెలియజేయగలరు.

**పాల హరికృష్ణ**
**తండ్రి: వెంకటేశ్వరరావు**
**కె. కన్నాపురం గ్రామం,**
**పెదవేగి మండలం,**
**సెల్ నెం: 77807 24749**

**CHANGE OF NAME**

I, **BOMMADEVERA SRI RAMA VEERA VENKATA KUMAR YETHIRAJULU,** S/o. B. Raghavarao Venkata Varaprasad rayulu Resident of D.No. 23a-7-19, KKS Street, above ICIC Bank, R.R.Pet, Eluru Town & Mandal, Eluru district, A.P. I have changed my name from **BOMMADEVARA SRI RAMA VEERA VENKATA KUMARA YETHIRAJULU** (Old name) To **BOMMADEVERA SRI RAMA VEERA VENKATA KUMAR YETHIRAJULU** (New name) for all practical purposes.